జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 22 | జనవరి | 2026 ♦ పేజీలు : 6



# ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి

♦ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 2:ప్రజా జ్యోతి** జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు .బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి నిర్వహించిన

మిగతా 2 లో...



# మాదక ద్రవ్యాల నియంత్రణ, రహదారుల భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలి

**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 21: ప్రజాజ్యోతి:** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు నివారణ, మాదకద్రవ్యాల వాడకం నియంత్రణకు శాఖల వారిగా చేపట్టవలసిన కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. గంజాయి సాగు అరికట్టేందుకు

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ఫ్లయింగ్ స్క్వాడ్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టాలని, రోజువారి తనిఖీ వివరాలను తప్పనిసరిగా నివేదించాలని అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై

మిగతా 2 లో...




# ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడమే లక్ష్యం

♦ జల్ శక్తి అంకల్ ను పకడ్బందీగా అమలు చేయాలి
♦ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 21,ప్రజా జ్యోతి** ప్రతి ఇంటికి నాణ్యమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా "జల్ శక్తి అంకల్" ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా స్థాయి త్రాగునీటి సరఫరా పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 1వ తేదీ నుండి 20 రోజులపాటు ప్రత్యేక కార్యాచరణగా జల్ శక్తి అంకల్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరాలో ఉన్న లోపాలను గుర్తించి, వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి గ్రామ, మండల స్థాయిలలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలు

మిగతా 2 లో...

# అనుక్షణం పర్యవేక్షిస్తున్నాం ... అప్రమత్తంగా ఉండండి

పులి కదలికలను పరిశీలిస్తున్నాం...మురళీకృష్ణ..అటవీ క్షేత్రాధికారి, యాయాతి రాజు ఎస్ఐ

**అశ్వారావుపేట, జనవరి 21,ప్రజాజ్యోతి :** మండలంలోని కావడి గుండ్ల అటవీప్రాంతంలో పులి సంచారం పై అనుక్షణం పర్యవేక్షిస్తున్నామని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ క్షేత్రాధికారి మురళీకృష్ణ అశ్వారావుపేట ఎస్ ఐ యాయాతి రాజు అన్నారు. బుధవారం అధికారులు పెద్దపులి దాడి చేసినట్లు భావిస్తున్న గిరిజన రైతు సోడెం నాగేశ్వరరావు పశువులను

మిగతా 2 లో...



# రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ

♦ ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**చర్ల, జనవరి 21:(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలో గల రైతు వేదిక భవనంలో బుధవారం జరిగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై రైతులకు వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేసే కార్యక్రమానికి భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సుదర్శన్ మాట్లాడుతూ చర్ల మండలంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై రైతులకు యంత్రాలు పనిముట్లను అందజేస్తున్నామని మండలంలో మొత్తం పదిమందికి అందజేస్తున్నామని వారిలో తొమ్మిది మందికి రోటవేర్లు ,ఒకరికి పవర్ ట్రిల్లర్ యంత్రాన్ని అందజేస్తున్నట్టు తెలియజేశారు. ఎస్టీలకు 70 శాతం ఎస్సీ బీసీలకు 50 శాతం మిగిలిన వారికి 40 శాతం సబ్సిడీతో యంత్రాలను అందజేస్తున్నామని అన్నారు. 1,27, 500 విలువచేసే రోటా వేర్ లను 46వేల సబ్సిడీ కింద రైతులకు 81,500అందజేస్తున్నామని 2 లక్షల పదివేల విలువ చేసి పవర్ ట్రిల్లర్ని 1,04,570కి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం శాసనసభ్యులు

మిగతా 2 లో...

## ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంగ్లిష్ ఫైనల్ ప్రాక్టికల్ పరీక్షలు జనరల్, వొకేషనల్ కోర్సుల ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు జనవరి 21, 2026న (9,278 మంది), సెకండ్ ఇయర్ విద్యార్థులకు జనవరి 22, 2026న (9,413 మంది) నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షలు జనవరి 23, 2026న, ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు జనవరి 24, 2026న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా, ఇంటర్మీడియట్ జనరల్, వొకేషనల్ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి ఫిబ్రవరి 20, 2026 వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18, 2026 వరకు ప్రతి రోజూ ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 37 థియరీ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఫస్ట్ ఇయర్ కు 9,278 మంది, సెకండ్ ఇయర్ కు 9,407 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 550 మంది ఇన్విజిలేటర్లు, 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 14 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిట్టింగ్ స్క్వాడ్ లు నియమించనున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రతకు పోలీస్ శాఖ సహకారంతో కట్టుదిట్టమైన చర్యలు చెపట్టాలి అని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, శుభ్రత, వైద్య సదుపాయాలు తదితర అన్ని మౌలిక వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ముందుగానే సిద్ధం చేసుకుని, నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. అదేవిధంగా, పరీక్షలు నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా విద్యాశాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ తదితర అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు, ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరావు, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ అరవింద్ బాబు, డిప్యూటీ డిఎంహెచ్వో ప్రసాద్, పోలీస్ శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి...)



డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా ఆనాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అమలవుచేసిన ఉచిత కరెంటు పథకాలను నేటికీ కొనసాగిస్తూ రైతులను ఆదుకుంటున్నదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకి అండగా రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిందని ఆ ఘనత మన ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డికి దక్కిందని అన్నారు. రైతులు వ్యవసాయంలో అనేక ఇబ్బందులకు పడుతున్నారని ఏ మందులు ఉపయోగించాలో తెలియకుండా కొన్నిసార్లు అధిక మోతాదులో మందులను పిచికారి చేయటం వలన వ్యాధులు బారిన పడుతున్నారని కావున రైతులు అధికమోతాదులో మందులు పిచికారి చేయకుండా తగిన మోతాదులో సరైన పద్ధతిలో వ్యవసాయం చేసుకోవాలని అన్నారు .మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయం చేయడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని కూలీలు దొరకక కష్టాలు పడుతున్నారని వారి కష్టాలను తీర్చేందుకు భవిష్యత్తులో డ్రోన్ ద్వారా మందులను పిచికారీ చేసి వ్యవసాయం చేసేందుకు రైతులకు సబ్సిడీ ద్వారా డ్రోన్లు అందించే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా చర్ల మార్కెట్ కమిటీ లో ఉన్న నిధులను ఉపయోగించుకొని వృధా కాకుండా రైతులకు ఉపయోగపడే గిడ్డంగులను స్టోరేజ్ చేసుకునే వాటిని నిర్మించాలని అన్నారు .చర్ల అగ్రికల్చర్ ఆఫీసర్ ఏ లావణ్య మాట్లాడుతూ సబ్సిడీపై రైతులకు యంత్రాలు పనిముట్లు అందజేయడం జరుగుతుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఎవరైనా రైతులు పనిముట్లు యంత్రాలు కావలసి ఉంటే మమ్మల్ని సంప్రదించవచ్చునని దరఖాస్తు చేసుకొని సబ్సిడీ పైన మీకు కావలసిన యంత్రాలను తీసుకోవచ్చని ఒకవేళ ఇక్కడ అందుబాటులో లేనిచో మిగిలిన చోటు నుండి యంత్రాలను తెప్పించి మీకు అందజేసే కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, ఏడిఓ సుదర్శన్, చర్ల ఏవో ఏ లావణ్య, ఎంపీడీవో ఈదయ్య, మండల తాసిల్దార్ శ్రీనివాస్, చర్ల పంచాయతీ ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు, ఇమ్మంది బుచ్చిబాబు, కాంగ్రెస్ నాయకులు లంక రాజు, చీమలమర్రి మురళి ,ఇరప వసంత్ ,బ్రహ్మానంద రెడ్డి ,మడకం పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు రైతులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణ, రహదారుల భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మాదకద్రవ్యాలను వినియోగిస్తున్న వారిని గుర్తించి వారికి తగిన కౌన్సిలింగ్ అందించాలని తెలిపారు. అయినప్పటికీ మాదకద్రవ్యాల వినియోగం కొనసాగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సారా తయారీపై నిఘా మరింత పెంచాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు పోలీస్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. చైతన్యం కార్యక్రమంలో భాగంగా బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల వినియోగం రక్తదానంపై కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రక్త నిల్వలు తక్కువగా ఉన్న సందర్భాల్లో ముందుగానే సమాచారం అందించడం ద్వారా విస్తృత స్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా భద్రాచలం బ్రిడ్జి ప్రాంతం నుండి అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇందుకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. యువత నిరుద్యోగం కారణంగా అడ్డదారులు తొక్కకుండా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా జిల్లాలో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా స్థాయి రహదారుల భద్రత కమిటీ సమావేశాన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో రహదారుల భద్రతపై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కువ ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడ్ వంటి కారణాల వల్ల జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసే సమయంలో కఠినమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రహదారుల భద్రత అవగాహన కోసం ప్రధాన కూడళ్లలో వాలంటీర్లను ఏర్పాటు చేసి, వారికి అవసరమైన మైకులు, హెల్మెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రధాన కూడళ్లలో హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై మైకుల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో ట్రాఫిక్ నిబంధనలపై చార్ట్ లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాలలో రోడ్ సేఫ్టీ కెప్టెన్ను నియమించాలని, ప్రతి వారం ప్రతి ప్రభుత్వ హైస్కూల్ లో రహదారుల భద్రతపై ప్రసంగాలు నిర్వహించేలా తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలకు అధికంగా లోనయ్యే టాప్–20 ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కాన్వెక్స్ మిర్రర్లు, హెచ్చరిక సూచిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు అమలులో ఉన్న పరిస్థితిని సమీక్షించారు. ఎన్ హెచ్–30 పరిధిలోని రామవరం సమీపంలోని బ్లైండ్ కర్వ్, భద్రాచలం ఆలయ రోడ్డులో పాదచారుల భద్రత, కుకునూరు రోడ్డులో రహదారి పరిస్థితులు , అక్కడ అమలవుతున్న భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అదనపు హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగులు, వెలుతురు సదుపాయాలు, అవసరమైన చోట వేగ నియంత్రణ చర్యలు మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రశాంతి నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్ కనెక్టివిటీ కోసం రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఎటువంటి వాహనాలు నిలపకుండా కఠిన చర్యలు చేపట్టాలని, ఓవర్ లోడ్ తో వెళ్తున్న వాహనాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారుల వెంట పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించేందుకు అత్యాధునిక పరికరాలు సమకూర్చి అవసరమైన నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల సమయంలో బాధితులను రక్షించేందుకు ప్రజలు ముందుకు వచ్చేలా గుడ్ సమరిటన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం చేసి ప్రాణాలు కాపాడిన గుడ్ సమరిటన్ లకు రూ. 25,000 ప్రోత్సాహక బహుమతి అంద జేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా గుడ్ సమరిటన్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య, ఆర్ అండ్ బి డి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పంచాయతీరాజ్ శ్రీనివాస్, ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, పోలీస్ శాఖ అధికారులు, వైద్య శాఖాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



## అనుక్షణం పర్యవేక్షిస్తున్నాం ... అప్రమత్తంగా ఉండండి





(మొదటి పేజీ తరువాయి...)

కట్టేసిన జామాయిల్ తోటతో పాటు సమీప అటవీప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో పులి కదలికలపై నిఘా పెంచమని, అత్యాధునిక టెక్నాలజీతో పులి సంచారాన్ని పరిశీలిస్తున్నామన్నారు. పశువులను అటవీ ప్రాంతాలను తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. రాత్రి వేళల్లో సమీప అడవుల్లో సంచరించవద్దని, పులికి సంబంధించిన ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే అటవీ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడమే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి...)

, ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి, ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తక్షణమే గుర్తించి సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి, వివరాలతో కూడిన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. త్రాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చోట కొత్త వాటర్ ట్యాంకుల నిర్మాణం, మరమ్మత్తులు, అదనపు వనరుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ప్రజలకు నీటి వృధా నివారణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రహదారుల వెంట, పైపు లైన్ల ద్వారా జరుగుతున్న నీటి లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించి, త్రాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు, ఈ సమావేశంలో విద్యా శాఖ అధికారి నాగలక్ష్మి , మిషన్ భగీరథ ఈఈ లు, తిరుమలేష్, నళిని, జిల్లా పంచాయతీ అధికారి సుధీర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా అదనపు డిఆర్డిఓ రవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ వార్షికోత్సవం

**కొత్తగూడెం సింగరేణి, జనవరి 21 – ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సిఓఏ క్లబ్ లో డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ముఖ్య అతిధిగా విచ్చేసారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమమును నిర్వహించి, అనంతరం ఈ ఆర్థిక సంవత్సరం 2025–26 లో నిర్వహించిన వివిద ఆటల పోటీల కు సంబంధించిన ఆన్యువల్ రిపోర్ట్ (వార్షిక) ను హానరరీ సెక్రెటరీ గారు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మానసిక ఉల్లసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్మికులలో టీమ్ స్పిరిట్ పెంపొందించడానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ టీమ్ స్పిరిట్ తో బొగ్గు ఉత్పత్తి మరియు రక్షణలో కూడా మెరుగుదల ఉందని అన్నారు. సింగరేణిలో అధిక సంఖ్యలో యువ రక్తం ఉందని, క్రీడలపై ఆసక్తి చూపించే విధంగా కార్మికులు క్రీడలు ఆడేలా వెటరన్ క్రీడాకారులు, కో–ఆర్డినేటర్ లు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని, కొత్తగూడెం ఏరియాకి కంపెనీ లెవెల్ లో అధిక సంఖ్యలో బహుమతులు గెలచి, కోల్ ఇండియాలో కొత్తగూడెం ఏరియా ప్రతిభ కనబరిచినందుకు అభినందించారు. డెపార్ట్మెంటల్ క్రీడలు మరియు ఆటలు పరదర్శకంగా, విజయవంతంగా నిర్వహించినందుకు సంబంధించిన అధికారులకు, డబల్యూపిఎస్ &జిఏ టీమ్ సభ్యులను అభినందించారు. అనంతరం కోల్ ఇండియా లో బాడీ బిల్డింగ్ విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించిన ఎం. రామకృష్ణ, అసిస్టెంట్ చైన్మెన్, జేవిఆర్ ఓసి.II ను శాలువాతో సత్కరించి చెక్కులను అంధించారు. అదేవిధంగా డెపార్ట్మెంటల్ క్రీడలలో పాల్గొన్ని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతుల ప్రధాన కార్యక్రమం జరిగింది. అనంతరం సేవా సభ్యులకు మరియు అధికారులకు బహుమతులను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటియూసి యూనియన్ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ జక్కుల గట్టయ్య, ఐఎన్‌టియూసి యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఎం.వి నరసింహారావు, ఎస్ఓటు జిఎం జి.వి కోటి రెడ్డి, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, అధికారులు ఉపేంద్ర బాబు, అజ్మీరా శ్రీనివాస్, జి. హరీష్, ఎం. మురళీ, యూ.అభిలాష్, స్పోర్ట్స్ కొఆర్డినేటర్ భూక్యా భీముడు, జనరల్ కెప్టెన్ బి. వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ మెంబర్స్ సిహెచ్. సాగర్, కె. శ్రీనివాస రెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు, ఏ. మహేశ్ ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.






# గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

♦ **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 21: ప్రజా జ్యోతి** 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరం లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలసి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం ప్రగతి మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు పలు సూచనలు చేశారు,. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఘనంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు గాను శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. సమర్ధవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యతనిస్తూ పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తిని చాటేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారికి సూచించారు. ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఫైర్ ఇంజెన్ అందుబాటులో ఉండాలని ఫైర్ శాఖ అధికారిని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రోటోకాల్ ను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశం లో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాల కార్మికుల నిర్మూలనకు ఆపరేషన్ స్మైల్‌ను సమష్టిగా విజయవంతం చేయాలి

♦ **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 21: ప్రజా జ్యోతి** బాల కార్మికుల నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు లేదా సహాయం అవసరమైన పిల్లలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించి, విద్యను అందించే బాధ్యతను సంబంధిత శాఖలు సమన్వయంతో నిర్వర్తించాలని తెలిపారు. కుటుంబాలకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చడంతో పాటు, అవసరమైతే సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించాలని ఆదేశించారు. బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆపరేషన్ స్మైల్ టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు ఖాళీగా ఉన్న నేపథ్యంలో, ఆశ్రమాలలో ఉన్న పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వారికి నాణ్యమైన విద్యతో పాటు సాధారణ జీవితాన్ని గడిపే అవకాశం కల్పించవచ్చని తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రెస్క్యూ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, రెస్క్యూ కార్యకలాపాలకు అవసరమైన వాహనాలు తదితర సౌకర్యాలపై నివేదికలు అందించాలని తెలిపారు. అందిన నివేదికల ఆధారంగా అవసరమైన వసతులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఈ సంవత్సరం జనవరి 1 నుంచి ఇప్పటివరకు 25 మంది పిల్లలను ఆపరేషన్ స్మైల్ ద్వారా రెస్క్యూ చేయడం జరిగింది అని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, సిపిఓ సంజీవ రావు,జిల్లా కార్మిక శాఖ అధికారి షర్ఫుద్దీన్, సి డబ్ల్యూ సి మెంబర్లు, సాదిక్ పాషా, సుమిత్ర దేవి, అంబేద్కర్, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలలో ప్రవేశాలకై దరఖాస్తు గడువు పెంపు



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 21: ప్రజాజ్యోతి** గురుకుల విద్యాలయాలలో 5వ తరగతి , 6 నుండి 9వ తరగతి వరకు బ్యాక్ లాగ్ వెకెన్సీ ప్రవేశాలకై నిర్వహించనున్న టి జి వి , సి ఈ టి– 2026 పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును 25–01–2026 వరకు పొడిగించడం జరిగిందనీ , ఇప్పటివరకు వివిధ కారణాల వల్ల దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువు లోపల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కిన్నెరసాని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ.ఎస్ . శ్యామ్ కుమార్ బుధవారం తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో ఈ ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్య, వసతి , భోజన సదుపాయాలు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యా , మంచి వాతావరణంలో హాస్టల్ వసతి, పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించబడతాయని, అర్హత కలిగిన గిరిజన విద్యార్థులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నామని. దరఖాస్తులు ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరించబడతాయని, క్రింద తెలిపిన వెబ్సైట్ లో దరఖాస్తు పెట్టుకోవాలని సూచించారు....వెబ్‌సైట్: https://tgcet.cgg.gov.in ఈ సందర్భంగా వివిధ మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ సమాచారాన్ని విద్యార్థులకు విస్తృతంగా తెలియజేసి, ఎక్కువ మంది గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్ కోరారు

# స్వచ్ఛత,హరితంలో మోరంపల్లి బంజర్ పాఠశాలకు అవార్డు



**బూర్గంపహాడ్, జనవరి 21, (ప్రజా జ్యోతి):** స్వచ్ఛత మరియు హరిత విద్యాలయ కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోరంపల్లి బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.పాఠశాలలో పరిశుభ్రత,జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, హరిత కార్యక్రమాల అమలులో చూపిన నిబద్ధత, విద్యార్థుల్లో బాధ్యతాయుత దృక్పథాన్ని పెంపొందించడంలో చేసిన కృషికి ఈ గుర్తింపు లభించిందని అధికారులు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కల పెంపకం, స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు గారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి సహకారంతోనే ఈ అవార్డు సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలతో పాఠశాలను ఆదర్శంగా నిలుపుతామని అన్నారు.ఈ ఘనతతో మోరంపల్లి బంజర్ గ్రామంతో పాటు జిల్లా విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## స్వచ్ఛత - పచ్చదనానికి గుర్తింపు..

♦ బుడ్డగూడెం పాఠశాలకు జిల్లా స్థాయి ప్రథమ బహుమతి



**కొత్తగూడెం, జనవరి 21. ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన స్వచ్ఛ – హరిత విద్యాలయ రేటింగ్ కార్యక్రమంలో బూర్గంపాడు మండలంలోని ఎంపీపీ ఎస్ బుడ్డగూడెం పాఠశాల విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ అవార్డును కైవసం చేసుకుంది. ప్రాథమిక పాఠశాలల విభాగంలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైన బుడ్డగూడెం పాఠశాలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా కేంద్రంలోని ఆనందగని పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విస్తృత పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించడంలో పాఠశాల చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించగా, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణలో బుడ్డగూడెం పాఠశాల ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందని అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పినపాక పట్టణ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, బుడ్డగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. ఈశ్వర్, ఉపాధ్యాయులు మధుతో పాటు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూసుగుప్పలో వైద్య శిబిరం





**చర్ల, జనవరి 21:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం మారుమూల ప్రాంతం అయిన పూసుగుప్పలో చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు .ఈ ఆరోగ్య శిబిరం లో వివిధ చిరు వ్యాధులతో బాధపడుతున్న 56 మందికి కి వైద్య సేవలు అందించారు. జలుబు దగ్గు స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్న వారికీ మందులు ఇచ్చారు .ఈ సందర్భగా డాక్టర్ హారిక మాట్లాడుతూ త్రాగడానికి ఉపయోగించే నీరు వేడి చేసి త్రాగాలని , కూల్డ్రింక్స్ స్వీట్ కి దూరం ఉండాలని అదేవిధంగా స్నానానికి ఉపయోగించే నీటిని కూడా వేడి చేసి స్నానం చేయాలని , గర్భిణీ స్త్రీలు టెస్టుల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొయ్యూరు కి రావాలని పోషకాహారం తీసుకోవాలని మందులు సమయానికి వేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందరూ తగు జాగర్తలు తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత పాటించాలని మల మూత్ర విసర్జన అనంతరం ,ఆహారం తినేముందు చేతులు సబ్బుతో కడుక్కోవటం ద్వారా అనేక వ్యాధుల నుండి మనలను మనం కాపాడుకోవచ్చని అన్నారు . ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామ్ ప్రసాద్,హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ గీత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేని ప్రయాణం యమలోకానికి మార్గం

♦ - టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్




**టేకులపల్లి,జనవరి21,ప్రజాజ్యోతి:** హెల్మెట్ లేని ప్రయాణం యమలోకానికి మార్గమని,ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఆలకుంట రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతపై ద్విచక్ర వాహనాదారులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో చర్య లు తీసుకుంటున్నా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నాసిరకం హెల్మెట్లు వాడకూడదన్నారు. ఖచ్చితంగా హెల్మెంట్ ధరిస్తే వాహనాదారులు ప్రమాదాల నుంచి బయటపడతారన్నారు. లేకపోతే కుటుంబ యజ మాని మరణించడం వల్ల కుటుంబం అంతా అనాధలుగా మారుతారని ఆయన అన్నారు .కావున ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించి వాహనాలు నడపాలన్నారు.అలాగే ఆటో రోడు మీద ఎక్కడపడితే, రోడ్డు నడి సెంటర్లో, ట్రాఫిక్ అంతరాయం కలిగించే విధంగా ఆటోలు నడిపినచో వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.వివిధ వాహనాలు నడిపే వారికి తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన తెలిపారు. వాహన పత్రాలు,లైసెన్సులు లేనిచో భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి మృతి




**అన్నపురెడ్డిపల్లి, జనవరి 21, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని తాటి బుచ్చన్నగూడెం గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కంపగూడెం గ్రామానికి చెందిన చాప వీరాస్వామి (68) ద్విచక్ర వాహనంపై గరీబ్‌పేట గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద స్థలానికి చేరుకున్న గ్రామస్థులు పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## పట్టణంలో ఆగని ద్విచక్ర వాహన చోరీలు

♦ ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహన చోదకులు


**భద్రాచలం, జనవరి 21,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలో ద్విచక్ర వాహన చోరీలు పట్టణవాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇళ్ల ముందు రాత్రి సమయంలో బైక్ కనిపిస్తే చాలు తెల్లారేసరికి బైక్ మాయం అవుతుండటం ఇటీవల కాలంలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో కాలనీల్లో ఇళ్ల ముందు నిలిపి హ్యాండిల్ లాక్ వేసిన బైక్‌లను టార్గెట్ చేసి మరీ ఎత్తుకెళ్తున్నారు బైక్ దొంగలు. గత పది రోజులుగా వరుసగా ఇప్పటి వరకు ఎనిమిది బైక్‌ల వరకు చోరీకి గురైనట్లు సమాచారం. తాజాగా మంగళవారం రాత్రి చర్ల రోడ్డులోని కల్పన ఫోటో స్టూడియో వద్ద నిలిపి ఉంచిన కేటీఎం 200 డ్యూక్ బైక్‌ను అపహరించారు. అయితే వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురి కావడంతో వాహనదారులు అలజడకి గురవుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా అప్రమత్తమై బైక్ దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ విషయంపై పోలీసులు ఇప్పటికే బైక్ దొంగల గురించి విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. త్వరగా ఈ సమస్యకు ముగింపు పలకాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా సీఎం కప్ 2 వ ఎడిషన్ పోటీలు



**టేకులపల్లి,జనవరి21,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం గంగారం ఆశ్రమ పాఠశాలలో సీఎం కప్ 2వ ఎడిషన్ కార్యక్రమంలో భాగంగా కోకో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను పాఠశాల ఇంచార్జి హెచ్ఎం బి.వాల్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగారం క్లస్టర్ సీఎం కప్ చైర్మన్ గంగారం సర్పంచ్ ఇర్ప రుక్మిణి, కిష్టారం సర్పంచ్ కోర్సా రామకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ఆడడం ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం,క్రమశిక్షణ పెరుగుతాయని వారు తెలిపారు. గ్రామ నుండి నేషనల్ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని, పంచాయతీ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గ్రామానికి మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బి. వెంకటేశ్వర్లు, పీడీలు సీత, బి.ఖన్న,మోతీలాల్, పాఠశాల సిబ్బంది,గ్రామ సెక్రటరీలు కోరం అనిల్ కుమార్, ఎం.సతీష్, గ్రామ పెద్దలు జోగ రామనాథం, ప్రవీణ్ కుమార్,పాయం అబ్బయ్య, జోగ సుమన్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం, జనవరి 21,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం సంప్రదాయబద్ధంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న దంపతులు స్వామి వారిని దర్శించుకొని కానుకలు సమర్పించారు. అలాగే కల్యాణంలో పాల్గొన్న వారికి అన్నదానం జరిగింది.

## ఎన్టీఆర్‌పై దూషణలు అంటే తెలుగుజాతిపై దాడే

- దూషణాత్మక వ్యాఖ్యలకు కఠిన చర్యలు తీసుకోవాలి
- దమ్మపేట చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్



**దమ్మపేట,జనవరి.21,(ప్రజాజ్యోతి):** తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకైన, దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) పై ఇటీవల ఒక వ్యక్తి బహిరంగంగా అసభ్యకరంగా, అవమానకరంగా మాట్లాడటం పట్ల చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ – దమ్మపేట కమ్మ సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. ఎన్టీఆర్ ఒక కులానికి మాత్రమే కాకుండా అన్ని కులాలకు, అన్ని వర్గాలకు ఆరాధ్యులైన మహానాయకుడని, ఆయనపై చేసిన ఇటువంటి వ్యాఖ్యలు తెలుగు సమాజం మొత్తం మనోభావాలను తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రమాదం ఉందని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తిపై చట్టపరంగా కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి దూషణాత్మక వ్యాఖ్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ దమ్మపేట కమ్మ సంఘం తరపున దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి కి ఫిర్యాదు అందజేశారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణలోకి తీసుకొని న్యాయం చేయవలసిందిగా పోలీసులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ దమ్మపేట అధ్యక్షులు శ్రీ పోతునేని శ్రీరామ వెంకటరావు, గౌరవ అధ్యక్షులు శ్రీ గడ్డిపాటి సత్యం, కార్యదర్శి పెనికలపాటి కృష్ణయ్య, ట్రెజరర్ యలమర్తి కిషోర్ కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు : భద్రాచలం సీఐ నాగరాజు



**భద్రాచలం,జనవరి 21,ప్రజాజ్యోతి :** యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, జ్ఞానాన్ని వృథా చేయకుండా కుటుంబం, సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలని భద్రాచలం సీఐ నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం పట్టణంలోని జగదీష్‌కాలనీలో "ఎరివ్ అలైవ్–2026" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముందు కళాకారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిదండ్రుల మాట వినకుండా మత్తుకు అలవాటు పడిన యువకుల వివరాలు తెలియజేస్తే, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారికి కౌన్సెలింగ్ చేసి అవసరమైతే రీహబిలిటేషన్ సెంటర్‌కు పంపిస్తామని తెలిపారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, అలా చేస్తే ప్రాణాంతక ప్రమాదాలు సంభవించి తమ కుటుంబాలతో పాటు ఎదుటి వారికీ తీవ్ర నష్టం కలగవచ్చని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుని ప్రమాదరహిత ప్రయాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై శ్యాంప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి, 19వ వార్డు మెంబర్ తుర్రం మహేష్, అడబాల వెంకటేశ్వరరావు, కాలనీవాసులు, యువత పాల్గొన్నారు.

# వావ్ అవార్డ్స్ 2026 లో కె ఎల్ ఆర్ న్యూ ఇందిరా ప్రియదర్శిని స్కూల్‌కు రన్నర్-అప్ అవార్డు







**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 21: ప్రజా జ్యోతి** పర్యావరణ పరిరక్షణలో విశేషంగా కృషి చేసిన కే ఎల్ ఆర్ న్యూ ఇందిరా ప్రియదర్శిని స్కూల్ మంచి గుర్తింపు సాధించింది. ఈ ఎస్ ఆర్ ఈ ఈ ఫౌండేషన్, ఐ టి సి, సి ఎస్ ఆర్ వావ్ ప్రాజెక్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వావ్ అవార్డ్స్ 2026లో, ఎస్ ఎస్ సి డ్రై రీసైక్లబుల్ వ్యర్థాల సేకరణలో రన్నర్–అప్ అవార్డుకు న్యూ ఇందిరా ప్రియదర్శిని పాఠశాల ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం బుధవారం తెలిపారు, ఈ సందర్భంగా కేఎల్ఆర్ సంస్థ సెక్రెటరీ సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యర్థాల వేర్పాటు పై అవగాహన పెంపొందిస్తూ, పర్యావరణ స్థిరత్వానికి పాఠశాల చేసిన కృషికి ఈ అవార్డు లభించింది అన్నారు, విద్యార్థుల ప్రవర్తనలో వచ్చిన సానుకూల మార్పులు వావ్ ప్రాజెక్ట్ విజయానికి దోహదపడ్డాయని నిర్వాహకులు తెలిపినట్లు తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవం జనవరి 21, 2026న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తీసుకోవడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరై విద్యార్థులను అభినందించారని తెలిపారు, ఈ కార్యక్రమానికి కె ఎల్ ఆర్ ఇందిరా ప్రియదర్శిని పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారని తెలిపారు, ఈ సందర్భంగా కేఎల్ఆర్ విద్యాసంస్థల అధినేత చైర్‌పర్సన్ నాగమణి మాట్లాడుతూ నెట్ జీరో లక్ష్య సాధనతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్‌కు ఈ పాఠశాల భాగస్వామ్యం ప్రశంసనీయమని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

# బిఆర్ఎస్ అగ్రనాయకత్వంతో తాటి భేటీ





**మాజీమంత్రులు కేటీఆర్, హరీష్ రావులను కలిసిన మాజీ ఎమ్మెల్యే తాటి**

ములకలపల్లి, జనవరి 21, ప్రజా జ్యోతి : బిఆర్ఎస్ అగ్ర నాయకులైన మాజీ మంత్రులు సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు లను మాజి ఎమ్మెల్యే,మాజీ ట్రైకర్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు బుధవారం బేటీ అయ్యారు. సిట్ విచారణ అనంతరం ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే హరీష్ రావును కలిసి సంఘీభావం తెలిపారు. కెసిఆర్ సారధ్యంలో ఆయన పిలుపుమేరకు ఎన్నో పోరాటాలు చేసిన హరీష్ రావు కేసీఆర్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్తారన్నారు. దొంగ దర్యాప్తుల పేరిట ఎన్ని నాటకాలు ఆడిన తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉంటారని, కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల ఆలోచనలను దారి మళ్లించే రాజకీయాలను చేస్తున్నారని మండిపడ్డారు.

**మాజీ మంత్రి,ఎమ్మెల్యే కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తాటి**

హైదరాబాద్ లోని నంది నగర్ లో మాజీ మంత్రి టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తాటి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన కేటీఆర్ తో మాట్లాడుతూ అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికలు పై చర్చించి ఎన్నికల ప్రచారానికి రావలసిందిగా కోరారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా పనిచేసే అశ్వారావుపేట మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని తాటికి కేటీఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తాటి కుమారుడు తాటి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



